క్లుప్తంగా

ఆలస్యంగా సెలవు సమచారం

బొంరాస్‌పేట: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రభుత్వం విద్యాలయాలకు గురువారం సెలవు ప్రకటించింది. అయితే ఈ విషయం ఉదయం 8.30 గంటల తరువాత తెలియడంతో అప్పటికే గ్రామాలు, తండాల నుంచి విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాలలకు చేరుకున్నారు. ఆలస్యంగా సమాచారం అందుకున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉసూరుమంటూ తిరుగు పయనమయ్యారు. లేటుగా సెలవు సమాచారం తెలియడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు.

'నేను బీఆర్‌ఎస్ పార్టీలోనే ఉన్నాను'

మర్పల్లి: 'నేను బీఆర్‌ఎస్ పార్టీలోనే ఉన్నాను. రెబల్‌గా గుర్తించి నాపై, నా వర్గంపై కక్ష్యసాధింపు చర్యలకు పాల్పడటం ఎంత వరకు సమంజసం' అని పట్లూర్ గ్రామ ఎంపీటీసీ స్వప్న భర్త, మండల యువజన నాయకుడు మొరంగపల్లి సురేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన గురువారం మాట్లాడారు. గ్రామానికి ఎమ్మెల్యే ఆనంద్ వస్తే.. తమను గృహ నిర్బంధం చేయడం ఏంటని ప్రశ్నించారు. తనపై, తమ కుటుంబ సభ్యులపై ఎమ్మెల్యే పోలీసులతో బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. దళిత ఎమ్మెల్యే అయి ఉండి, దళితులపై వివక్ష చూపుతున్నారని, ఎమ్మెల్యే వర్గీయులు అభివృద్ధి పనుల్లో నాణ్యత లేకుండా పనులు చేసి బిల్లులు కాజేశారని ఆరోపించారు. ఇలాంటి దిగజారుడు రాజకీయాలు మానుకోవాలని సూచించారు.

రైతుబీమాను వినియోగించుకోండి


దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏఈఓ హేమ

బొంరాస్‌పేట: పట్టాదారు పాసుపుస్తకాలతో అర్హత కలిగిన రైతులంతా రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని ఏఈఓ హేమ చెప్పారు. గురువారం బొంరాస్‌పేట మండలం ఎన్కేపల్లిలో ఆమె రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. వచ్చే నెల 5వ తేదీ లోపు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని, పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు నామిని ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా పుస్తకం జిరాక్స్ కాపీలను అర్జీ ఫారానికి జతచేసి అందజేయాలని సూచించారు.

డివైడర్లు సరే.. లైటింగ్స్ ఏవి?


సెంట్రల్ లైటింగ్స్ లేని మెయిన్ రోడ్డు

- ఇరుకుగా మారిన రహదారి
- రాత్రి వేళలో వాహనదారుల ఇక్కట్లు
- సరైన వెలుతురు లేక పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు

బంట్వారం: 'విస్తరణ పనులు చేపట్టకుండానే డివైడర్లు ఏర్పాటు చేశారు. వాటిని నిర్మించి మూడేళ్లు కావస్తున్నా.. ఇంత వరకు రోడ్డు మధ్యలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయలేదు. దీంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అయినా సంబంధిత అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదు' అని స్థానికులు, వాహనదారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. కోట్‌పల్లి మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ మెయిన్ రోడ్డుపై కోట్‌పల్లి ఆంధ్రాబ్యాంక్ నుంచి మార్కెట్ కమిటీ కార్యాలయం వరకు రూ.25 లక్షలతో డివైడర్లు నిర్మించారు. కానీ సెంట్రల్ లైటింగ్స్ ఏర్పాటు చేయలేదు. దీంతో మెయిన్ రోడ్డుపై రాత్రి వేళ సరైన వెళుతురు లేక.. వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

తరచూ ప్రమాదాలు

సదాశిపేట నేషనల్ హైవేకు కోట్‌పల్లి మీదుగానే తాండూరుకు నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. డివైడర్లు ఏర్పాటు చేసిన నాటి నుంచి వన్‌వే చేసినప్పటికీ.. ఈ ప్రధాని రహదారి ఇరుకుగా మారింది. మూలమలుపుల వద్ద రెండు వైపులా రోడ్డు మరింత కుంచించుకుపోయి కనిపిస్తుంది. గతంలో తాండూరు వైపు వెళ్తున్న ఓ స్విఫ్ట్ కారు రెండేళ్ల కిందట అదుపు తప్పి ఓ దుకాణంలోకి దూసుకుపోయింది. దుకాణం మూసి ఉండడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోయినప్పటికీ.. షాపు షెట్టర్ ధ్వంసమైంది. కారు రోడ్డుపై పల్టీలు కొట్టింది. చిన్నచిన్న ప్రమాదాలు తరచూ జరుగుతున్నప్పటికీ.. పెద్ద రోడ్డు ప్రమాదాలు జరగకముందే రోడ్డు విస్తరణతో పాటు, లైట్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

బస్సులు వెనక్కి తిప్పడం కష్టమే

దివైడర్లు ఏర్పాటు చేయడంతో రహదారి విస్తరణ తగ్గి ఆర్టీసీ బస్సులు వెనక్కి తిప్పడం డ్రైవర్లకు తలనొప్పిగా మారింది. వికారాబాద్-కోట్‌పల్లి లోకల్ బస్సులు బస్టాండ్ వద్ద నుంచే వెనక్కి తిప్పుతున్నారు. మెయిన్ రోడ్డు పక్కన బస్టాండ్ ఉండడంతో అక్కడే ప్రైవేటు వాహనాలు నిలిపి ఉంచుతారు. ఇరువైపులా రోడ్డు ఇరుకుగా మారడం .. మధ్యలో డివైడర్లు ఉండడంతో భారీ వాహనదారులకు ఇబ్బందిగా మారింది.

ప్రతిపాదనలు పంపాం

కోట్‌పల్లి మెయిన్ రోడ్డుపై సెంట్రల్ లైటింగ్స్ కోసం రూ.32 లక్షలకు ప్రతిపాదనలు పంపాం. బడ్జెట్ మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం. స్థానికుల వినతుల మేరకు రూ.25 లక్షలతో డివైడర్లు నిర్మించాం. రెండు వైపులా అయిదున్నర మీటర్లకు తగ్గకుండా సీసీరోడ్డు నిర్మించాం. కొన్నిచోట్ల రోడ్డుకు దగ్గరగా దుకాణాలు ఉండడంతోనే ఇరుకుగా ఉంటుంది. ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాస్, డీఈ ఆర్‌అండ్‌బీ

ఉపయోగం లేని 'డబుల్' స్కీం

లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించాలి: బీజేపీ


కుల్కచర్ల: డబుల్ బెడ్‌రూంలను పరిశీలిస్తున్న బీజేపీ నేతలు

కుల్కచర్ల: డబుల్ బెడ్ రూం ఇళ్ల పథకం వలన ఎవరికీ ఉపయోగం లేదని బీజేపీ చౌడాపూర్ మండల అధ్యక్షుడు బంధయ్య ఆరోపించారు. గురువారం చౌడాపూర్ మండలం అడవివెంకటాపూర్‌లో డబుల్ బెడ్ రూం ఇళ్లను ఆ పార్టీ నేతలు పరిశీలించారు. అనంతరం అక్కడే నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బంధయ్య మాట్లాడారు. డబుల్ బెడ్ రూం ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన మోర్చా ప్రధాన కార్యదర్శి గోవింద్ నాయక్, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, జిల్లా ఎస్సీమోర్చా కార్యదర్శి శ్రీనివాసులు, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు శరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల అరెస్టు

యాలాల: డబుల్ బెడ్ రూం ఇళ్ల పరిశీలనకు బీజేపీ రాష్ట్ర నాయకత్వం ఇచ్చిన 'ఛలో బాటసింగారం' కార్యక్రమంలో భాగంగా గురువారం పార్టీ నాయకులు సమాయత్తం అవుతుండగా.. తెల్లవారు జామున వారిని పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు హన్మంతు, నాయకులు సంపత్‌గౌడ్, లక్ష్మీకాంత్‌రెడ్డి, యాదగిరి తదితరులను అదుపులోకి తీసుకొని పీఎస్‌కు తరలించారు. ఈ సందర్భంగా హన్మంతు మాట్లాడారు. డబుల్ బెడ్ రూం ఇళ్ల పేరిట రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ప్రజలను మోసం చేసిందని, పీఎం ఆవాస్ యోజన నిధులను సైతం పక్కదారి పట్టించి, దొంగ లెక్కలు చూపిస్తుందని ఆరోపించారు.

పూడూరులో..

పూడూరు: బాటసింగారంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల పరిశీలనకు వెళ్తున్న బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశ్ పటేల్, మండల అధ్యక్షుడు అనీల్‌ముదిరాజ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు రవీందర్, పరిగి అసెంబ్లీ కన్వీనర్ రాజులను ముందస్తుగా అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ గిరి తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో అవినీతి పెరిగిపోయిందని ఆరోపించారు. కమీషన్ల కోసమే నాయకులు పని చేస్తున్నారన్నారు.

శ్రీవారి సన్నిధికి తరలిన భక్తులు

బొంరాస్‌పేట: 'శ్రీవారి సేవకులు'గా తిరుమల తిరుపతి దేవస్థాన సన్నిధిలోని భక్తులకు సేవలందించేందుకు మండలంలోని రేగడిమైలారం, దుద్యాల మండలం చిల్మల్‌మైలారానికి చెందిన దైవసేవకులు, ఆధ్యాత్మిక భక్తులు తరలివెళ్లారు. గురువారం రేగడిమైలారంలోని ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేసి 12 మందితో కూడిన సేవాబృందం తిరుమలకు వెళ్లింది. ఈ నెల 28 వరకు సేవలందిస్తామని భక్తులు తెలిపారు. శ్రీవారి సన్నిధిలో భక్తులకు అన్నదానం, వైకుంఠం-2లో ప్రసాదాల పంపిణీ, తలనీలాల సమర్పణ, ప్రాంగణం, ఆస్పత్రిలో వైద్యసేవలు, భద్రత విభాగంలో తనిఖీ, క్యూలైన్‌లో భద్రతా సిబ్బందిగా సేవలందిస్తామని సభ్యుడు కుమ్మరి వెంకటయ్య తెలిపారు.

సత్యసాయి సేవలో ముస్లిం యువకుడు


సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం

కొడంగల్ రూరల్: ఓ ముస్లిం యువకుడు సత్యసాయిబాబా భక్తులకు అన్నదానం చేసి మతసామరస్యాన్ని చాటుకున్నాడు. ప్రతి గురువారం పట్టణంలోని శ్రీ భగవాన్ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. పట్టణానికి చెందిన ముజీబ్ రహమాన్ కుమారుడు నియాస్ సొంత ఖర్చులతో అన్నదానం చేశాడు. తొలుత బాబాకు పూజలు చేసి, కార్యక్రమాన్ని ప్రారంభించాడు. ఈ సందర్భంగా నియాస్‌ను పలువురు అభినందించారు. కార్యక్రమంలో శ్రీభగవాన్ సత్యసాయి భజన మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సేవలతోనే గుర్తింపు


మాట్లాడుతున్న ఎస్‌ఐ రవిగౌడ్

కొడంగల్ రూరల్: విధి నిర్వహణలో ఉద్యోగుల సేవలకు సమాజంలో గుర్తింపు లభిస్తుందని మున్సిపల్ కౌన్సిలర్ మధుసూదన్‌యాదవ్, ఎస్‌ఐ రవిగౌడ్ అన్నారు. గురువారం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన సీఐ శంకర్, ఎస్‌ఐ రవిగౌడ్ వీడ్కోలు సమావేశంలో వారు మాట్లాడారు. పోలీసుశాఖతోనే సమాజంలో శాంతిభద్రతలు నెలకొంటాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఐ, ఎస్‌ఐల సేవలను ఆయన కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ వెంకట్‌రెడ్డి, ఆశప్ప, పకీరప్ప, యూసుఫ్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెద్దేముల్ ఎస్‌ఐగా కాశీనాథ్



పెద్దేముల్: పెద్దేముల్ ఎస్ఐగా కాశీనాథ్ గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో పనిచేసిన ఎస్‌ఐ విద్యాచరణ్‌రెడ్డి సంగారెడ్డి జిల్లాకు బదిలీపై వెళ్లడంతో అక్కడ పనిచేసిన కాశీనాథ్ ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వర్షాలు కురుస్తున్నందున ప్రజలు జాగ్రతగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితులు, సమస్యలు ఏమైనా ఉంటే ఫోన్ నంబర్ 87126 70053ను సంప్రదించగలరు.

దోమ ఎస్‌ఐగా రవి గౌడ్

దోమ: దోమ ఎస్‌ఐగా రవి గౌడ్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన ఎస్‌ఐ విశ్వజన్ వికారాబాద్ వన్ టౌన్‌కు బదిలీ కాగా.. కొడంగల్ ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న రవిగౌడ్ దోమకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ రవిగౌడ్ మాట్లాడారు. శాంతి భద్రతల పరిరక్షణకు పాటు పడతానని, గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటానని చెప్పారు.

పనితోనే గుర్తింపు

కొందుర్గు: పార్టీకోసం కష్టపడి పనిచేసిన వారికి తప్పకుండా గుర్తింపు లభిస్తుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం జిల్లేడ్ చౌదరిగూడ మండలం తూంపల్లిలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై.. మాట్లాడారు. బీఆర్‌ఎస్ నాయకుల దౌర్జన్యాలకు త్వరలో చరమగీతం పాడుతామని చెప్పారు. రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు రాజు, కృష్ణారెడ్డి, నాయకులు పురుషోత్తంరెడ్డి, వెంకట్‌రామ్, జితేందర్‌రెడ్డి, మల్లేశ్, దామోదర్, సలీం, యాదయ్య, బాల్‌రాజ్, వెంకటయ్య పాల్గొన్నారు.

మండల పరిషత్‌కు ఆర్థిక వనరులివే


షాపింగ్ మాల్‌ను ప్రారంభిస్తున్న ఎంపీపీ కరుణ

బషీరాబాద్: షాపింగ్ కాంప్లెక్స్‌తో మండల పరిషత్‌కు ఆర్థిక వనరులు సమకూరుతాయని ఎంపీపీ కరుణ అన్నారు. గురువారం జిల్లా పరిషత్ సాధారణ నిధులతో నిర్మించిన దుకాణ సముదాయాన్ని ఎంపీపీ ప్రారంభించి మాట్లాడారు. జెడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి చొరవతో మండలానికి జిల్లాలోనే అధికంగా నిధులు తెచ్చామని తెలిపారు. అర్హులైన వారికి షాపులు కేటాయిస్తామని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ అన్నపూర్ణ, పీసీఎస్ వైస్ చైర్మన్ అజయ్ ప్రసాద్, సర్పంచ్‌లు ప్రియాంక, శాంతి, నవనీతరెడ్డి, పద్మ, భీమప్ప, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పెద్దేముల్: పొంగిపొర్లుతున్న గాజీపూర్ వాగు


యాలాల: కోకట్ కాగ్నా నది వరద ప్రవాహం


ధారూరు: నేల కూలిన విద్యుత్ స్తంభం


పరిగి: పరుగులు తీస్తున్న పరిగి వాగు

భద్రంగా వాహనాలు నడిపి..


తాండూరు-హైదరాబాద్ రహదారి దుస్థితి

తాండూరు: తాండూరు రోడ్లు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి.. ఇటీవల రూ.కోట్ల నిధులతో వేసిన రహదారులు.. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకే మోకాళ్లోతు గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు. తాండూరు-హైదరాబాద్ మార్గం పొడవునా.. గుంతలే కనిపిస్తున్నాయి. తాండూరు-కొడంగల్, తాండూరు-చించోళి మార్గాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. గుంతలు ఏర్పడకుండా వర్షపు నీరు నిలిచిపోయాయి. దీంతో ఎక్కడ గుంత ఉందో తెలియని పరిస్థితి. భద్రంగా వాహనాలు నడిపి.. క్షేమంగా గమ్యానికి చేరుకోవాలి.

నిలకడగా.. నిర్విరామంగా

విస్తారంగా వర్షాలు • జలమయమైన లోతట్టు ప్రాంతాలు • మునుగేసిన పల్లెలు


పరిగి: పొలాల్లో నిలిచిన వర్షపు నీరు

ఎడతెరిపి లేని వర్షాలతో పల్లెలు, పట్టణాలు ముసుగేశాయి. మోస్తరు ముసురుతో మొదలై.. ఉగ్రరూపం దాల్చడంతో జనజీవనం స్తంభించిపోయింది. పాఠశాలలు, వ్యాపార సముదాయాలు మూతపడ్డాయి. రోడ్లన్నీ జలమయమై.. వాహనాల రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. వాగులు వంకలు ఉధృతంగా ప్రవహిస్తుండగా.. చెరువులు జలపాతంతో నిండుకుండలా మారి.. దిగువ ప్రాంతాలకు పరుగులు పెట్టాయి. దీంతో పలు ప్రాంతాల్లో పంట పొలాలు నీట మునిగి, రైతులు కన్నీటి పర్యంతం అవుతున్నారు. కొన్ని చోట్ల విద్యుత్ స్తంభాలు నేలకూలగా.. పోలీసులు, ఇతర అధికారులు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే తప్ప బయటకు రావద్దని హెచ్చరిస్తున్నారు.

–సాక్షి, నెట్‌వర్క్


పెద్దేముల్: నిండు కుండలా మంబాపూర్ చెరువు


బొంరాస్‌పేటలో మహంతీపూర్ వాగు


కొడంగల్ రూరల్: ఖాజాఅహ్మద్‌పల్లి వాగు దాటుతున్న ప్రజలు


నవాబుపేట: గంగ్యాడ వద్ద మూసీనది

ఆపద వస్తే.. తెలపండి


ముజాహిద్‌పూర్ వృద్ధురాలితో మాట్లాడుతున్న తహసీల్దార్ రమేష్‌కుమార్

కుల్కచర్ల: ఎడతెరిపి లేని వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కుల్కచర్ల ఎంపీడీఓ నాగవేణి, తహసీల్దార్ రమేష్‌కుమార్‌లు సూచించారు. గురువారం కుల్కచర్ల మండలం ముజాహిద్‌పూర్‌లో వారు పర్యటించారు. శిథిలావస్థ ఇళ్లల్లో నివసిస్తున్న వారిని.. వారి బంధువుల ఇళ్లలో ఉండేలా ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వర్షాలతో ఏదైనా ఆపద వస్తే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ ఖరీం, పంచాయతీ కార్యదర్శి సంతోష్, కారోబార్ యాదయ్య, స్థానిక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


తాండూరు టౌన్ ఆదర్శనగర్‌లో వరదనీరు


వికారాబాద్ రైతుబజార్‌లో..

ఎలాంటి ఇబ్బందులున్నా..


మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం. చిత్రంలో కమిషనర్ షఫీవుల్లా

తాండూరు టౌన్: భారీ వర్షాల కారణంగా తాండూరు పట్టణ మున్సిపల్ కార్యాలయంలో అధికారులు కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. ఈ మేరకు గురువారం కమిషనర్ షఫీవుల్లా అధికారులతో సమావేశమయ్యారు. వరదనీటి ప్రవాహానికి ఆటంకం కలగకుండా మురుగుకాలువల్లో నిండిన చెత్తను తొలగించాలని, వరదను దారి మళ్లించే చర్యలు చేపట్టాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. శిథిలావస్థకు చేరిన పాత భవనాలు, ఇళ్లను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. నిరంతరం కంట్రోల్ రూం కొనసాగుతుందని, ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే 08411-272021 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు.


తాండూరు రూరల్: చింతమణిపట్నంలో కూలిన ఇంటిని పరిశీలిస్తున్న అధికారులు


వికారాబాద్: పీరంపల్లి వాగు వరద ఉధృతి


వికారాబాద్ అర్బన్: రాజీవ్ గృహకల్పలో చేరిన వరద నీరు..


పరిగి: మాదారంలో కూలిన ఇంటిని పరిశీలిస్తున్న ఎంపీపీ అరవింద్‌రావు, ఎంపీడీఓ శేషగిరిశర్మ